సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

జయమ్ము.. నిశ్చయమ్ము



ఆర్పీ పేట హైస్కూల్‌లో పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

- టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఆర్పీ పేట, కప్పరాడ హైస్కూళ్లలో ప్రత్యేక తరగతులు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల బోధన

కంచరపాలెం: విద్యార్థి దశలో అత్యంత కీలకమైన పదో తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈమేరకు నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. కంచరపాలెం ఆర్పీ పేట, కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ స్టూడెంట్లకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, విజయమాలిని తెలిపారు. ఆర్పీ పేట హైస్కూల్‌లో 143 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరిలో 69 మంది బాలికలు, 74 మంది బాలురు ఉన్నారు. కప్పరాడ హైస్కూల్‌లో 103 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 56 మంది బాలికలు, 47 మంది బాలురు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తి కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సబ్జెక్ట్‌ల్లో వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు అందిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఒత్తిడిని అధిగమించేలా..

బంగారు భవిష్యత్తుకు చక్కని పునాది వేసే దశ పదో తరగతి. ఈ పరీక్షలు రాసే విద్యార్థుల్లో కాస్త ఒత్తిడి ఉండటం సహజమే. నిత్యం శ్రద్ధగా చదువుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధమవుతున్నామని పలువురు టెన్త్ విద్యార్థులు చెబుతున్నారు. ఒత్తిడిని అధిగమించే పరీక్షలు బాగా రాసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అనేక సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. టెన్త్ విద్యార్థులు సిలబస్ పూర్తిచేసి రెట్టించిన ఉత్సాహంతో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని ఉపాధ్యాయులు తెలియజేశారు. వచ్చే నెల 3 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న టెన్త్ విద్యార్థులు తాము ప్రస్తుతం ఎలా సన్నద్ధమవుతున్నది, ఉపాధ్యాయులు ప్రోత్సాహాన్ని ఇలా చెప్పుకొచ్చారు.



కప్పరాడ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులకు హాజరైన టెన్త్ విద్యార్థులు

నిర్దేశించిన సిలబస్‌ను అనుసరిస్తూ..



సబ్జెక్ట్ టీచర్లు చెప్పే విధానాలను, నిర్దేశించిన సిలబస్ అనుసరిస్తూ తరగతిలో, ఇంటి దగ్గర చదువుతూ టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. పరీక్షలయ్యే వరకు ఇంటి పనులేవీ తల్లిదండ్రులు చెప్పడం లేదు. నా ఏకాగ్రత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

– శీల దివ్యశ్రీ, ఆర్పీ పేట హైస్కూల్

ప్రత్యేక తరగతులు ప్రయోజనకరం



ప్రత్యేక తరగతుల పేరిట ఉదయం, సాయంత్రం వేళల్లో గణితంలోని సమస్యలను సూక్ష్మపద్ధతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పాఠశాలలో టీచర్లు అన్ని సబ్జెక్టులు చదివించడం వల్ల నేను పరీక్షలకు సిద్ధంగా ఉన్నా. ఇంట్లో అమ్మ పోషకాహారం ఇస్తున్నారు.

– ఎస్.భవిష్యశ్రీ, కప్పరాడ హైస్కూల్

ప్రతి రోజూ పునశ్చరణ చేస్తున్నా..



అమ్మ ప్రతి రోజు నాతో అన్ని పాఠ్యాంశాలను పునశ్చరణ చేయిస్తోంది. పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయులు సైన్స్‌కు సంబంధించి బొమ్మలు ఎలా గీయాలో దగ్గరుండి నేర్పిస్తున్నారు. మంచి గ్రేడింగ్‌తో టెన్త్ పరీక్షల్లో పాస్ ఇంటర్‌లో బైపీసీ చదువుతాను.

– పి.శ్రీవిఘ్నేష్, ఆర్పీ పేట హైస్కూల్

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థి హాజరు కాకపోతే తల్లిదండ్రులకు సమాచారం అందించి తరగతికి వచ్చేటట్లు చూస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు అందించిన మెటీరియల్స్‌తో బోధిస్తున్నాం.

– ఆర్.శ్రీనివాసరావు, హెచ్‌ఎం, ఆర్పీ పేట జీవీఎంసీ హైస్కూల్

రామలింగేశ్వరాలయ హుండీ ఆదాయం లెక్కింపు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణా నగర్‌లోని రామలింగేశ్వరాలయంలో శనివారం హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈవో రమాభాయి, సూపర్‌వైజర్ అల్లు జగన్నాథరావు, ఆలయ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో శ్రీహరి సేవా సంఘం సభ్యుల ఆదాయం లెక్కించారు. గతేడాది డిసెంబర్ 27 నుంచి ఈ నెల 18 వరకు రూ.1,70,523 ఆదాయం వచ్చినట్టు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు మార్తాండమూర్తి, రాము, అమ్మాజీ, శ్రీదేవి, క్లర్క్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



పెందుర్తి భవిత కేంద్రంలో పిల్లలకు వైద్య సేవలందిస్తున్న కో ఆర్డినేటర్

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తగిన శ్రద్ధ తీసుకుంటున్నట్లు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తెలిపారు. జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. వైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరపి సేవలను సైతం అందిస్తున్నామన్నారు. పెందుర్తి భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో చదువుతో ఆరోగ్య పరమైన సేవలు అందిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

'నాటు నాటు'కు ఆస్కార్ అభినందనీయం



కేక్ తినిపిస్తున్న సీనియర్ నటుడు మిశ్రో

సీతంపేట: ప్రపంచ సినిమా చరిత్రలో తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు రావడం మరువలేని జ్ఞాపకమని వక్తలు కొనియాడారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన నాటు నాటు.. పాట ఆర్‌ఆర్‌ఆర్ సినిమా టీమ్‌కు అభినందనలు తెలుపుతూ వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్‌చేసి ఆహుతులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో మాట్లాడుతూ ప్రపంచ సినీ చరిత్రలో ఈ తెలుగు పాట గురించి రాబోయే కాలంలో గుర్తు చేస్తుందన్నారు. ఆస్కార్ అవార్డు పొందిన చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని సొసైటీ అధ్యక్షుడు ఎన్.ఎ.డి.పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు.

కోర్సు మెటీరియల్ ఆవిష్కరణ



కోర్సు మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డెల్టా స్టడీస్ ఆధ్వర్యంలో నూతనంగా తీర్చిదిద్దిన 'మోడరన్ అండ్ ఏన్షియంట్ డెల్టా సిస్టమ్స్–ఏ ఫీల్డ్ సెమినార్' కోర్సు మెటీరియల్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కె.ఎస్.ఎన్. రెడ్డి, కోర్సు డైరెక్టర్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు నాలుగు రోజులు ఫీల్డ్ సెమినార్‌ను డెల్టా స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కెర్న్ ఆయిల్, గ్యాస్, వేదాంత లిమిటెడ్ సంస్థల్లో పనిచేస్తున్న 18 మంది అధికారులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.

యువతే దేశానికి వెన్నెముక

మద్దిలపాలెం: యువతే దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం నిర్వహించిన యువ సదస్సులో ఆమె మాట్లాడారు. యువత సమర్థవంతంగా పని చేస్తే, దేశం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు.

పట్టభద్రుల్లో చైతన్యం

సీతంపేట: ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీ వైఫల్యం చెందిందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితంతో ఇది స్పష్టమైందని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు చైతన్యవంతులై ఓటు చేసి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారన్నారు. శ్రీనివాస పట్నాయక్, పోతల ప్రసాద్, రూప, నాగలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవాలు

సీతమ్మధార/సీతంపేట/మురళీనగర్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు గెలుపొందిన సందర్భంగా శనివారం ఆ పార్టీ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. 14వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు.

- 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యంలో శాంతిపురంలోని ఆమె కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, కార్యదర్శి పెద్ద లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.
- టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కార్యాలయంలో కలిసి ఆయనతో కేక్ కట్‌చేయించారు.

ఆధ్యాత్మికం

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి చరణాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన మొదలగు పూజలు జరిపారు. ఆలయం రద్దీగా ఉండటంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు తొలి పూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందిచారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన నిర్వహించారు.

కలియుగ వెంకన్న ఆలయంలో..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెంకన్న, పద్మావతి, అలమేలు మంగమ్మలకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన మొదలగు పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ జరిపారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య వృద్ధి



సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని జాజి టెక్నాలజీస్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.సునీల్ కుమార్ అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులను ఉద్దేశించి శనివారం ఆయన ప్రత్యేక ప్రసంగం అందించారు. విద్యార్థి దశలో సముపార్జించిన జ్ఞానం భవిష్యత్తులో ఉత్పత్తి, మేనేజ్‌మెంట్, సర్వీస్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎనర్జీ రంగాలలో ఉపాధి అవకాశాలు పొందేలా డీసీఎంఎస్ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. బిజినెస్ ఎనలిటిక్స్ సాఫ్ట్‌వేర్‌ను నేర్చుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. వ్యాపార రంగంలో ఉన్న విభిన్న అవకాశాలను వివరిస్తూ, వాటిని పొందడానికి అవసరమైన సామర్థ్యాలు తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, పోతిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ బి.సుబ్బయ్య, ఆచార్య ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతతోనే అభివృద్ధి భారతావని సాకారం

ఏయూక్యాంపస్: భారతావని అభివృద్ధి యువతతోనే సాకారం అవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నేటి తరానికి అవసరమైన స్ఫూర్తిని అందించే బాధ్యతను ఆచార్యులు స్వీకరించాలని సూచించారు. ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్లిష్ట పరిస్థితుల నుంచి నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. నిరంతర పరిశోధనలు జరగాలని సూచించారు. ఆలోచనలకు పునాదిగా సదస్సులు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించడంతోనే ప్రగతి సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య కె.రాంజీ, బి.ఆర్.ఎల్. ఐశ్వర్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆవిష్కరించారు. వర్సిటీ తరపున ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావును సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



చెక్కు అందజేస్తున్న దాత రమణారెడ్డి

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని ఆర్కేబీచ్ ప్రాంతానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే దాత లక్షా 1116లు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు సంబంధిత చెక్కు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన చైతన్య కృష్ణతేజ అనే దాత రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో పీఆర్వో సునీల్‌కు చెక్కు రూపంలో అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించారు.

త్వరితగతిన నగర సుందరీకరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



రైల్వే స్టేషన్ రోడ్డులో సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం షీలానగర్, ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ జంక్షన్, మర్రిపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీ20 సదస్సుకు ఎంతో మంది దేశ విదేశీ ప్రతినిధులు వస్తున్నందున, వారికి ఆహ్లాదం కలిగించేలా నగర సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన మార్గంలోని బారికేడ్ల వద్ద వినియోగంలో లేని కేబుల్ వైర్లు తొలగించాలని, అవసరమైన వైర్లను క్రమబద్ధీకరించాలని, అనుమతి లేని ప్రకటన బోర్డులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైలింగ్‌కు పెయింటింగ్ రెండో సారి వేయాలని, సెంట్రల్ మీడియంలో మొక్కలు, వాటి మధ్య ఖాళీలు అక్కడక్కడ ఉన్నాయని, ఆ ప్రాంతంలో కొత్తవి నాటాలన్నారు. పాత సూచిక బోర్డులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, బస్ షెల్టర్లను ఆధునికీకరించాలని, మొక్కలను ట్రిమ్ చేస్తూ, ప్రధాన రహదారి పొడుగునా ఉన్న ప్రతి మొక్కకు రోజూ నీరు పోయాలన్నారు. మర్రిపాలెంలోని 24/7 తాగునీటి ప్రాజెక్టును పరిశీలించేందుకు అతిథులు ఆ ప్రాంతాన్నిసందర్శిస్తారని, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిత్యం మనం ప్రజలకు తాగు నీరు ఏ విధంగా అందిస్తున్నామో తెలియజేయాలన్నారు. మాధవధార రిజర్వాయర్, దాని చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అందంగా మార్చాలని ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, హార్టికల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, సింహాచలం, మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ కె.వేణుగోపాలరావు, డీసీపీ సంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ శేషసాయికి స్వాగతం పలుకుతున్న నరసింగరావు

విశాఖ లీగల్: న్యాయసేవ ప్రాధికార సంస్థ, ఉచిత న్యాయసేవలు, చట్టాలపై న్యాయవాదులు, ప్రజలకు అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లోక్ అదాలత్ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ ఆకుల శేషసాయి అన్నారు. శనివారం ఆయన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నరసింగరావు, మెట్రోపాలిటిన్ సెషన్ జడ్జి ఎం.రమణారావు, లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు న్యాయమూర్తితో పలు అంశాలపై చర్చించారు. గత ఏడేళ్లలో ఆరు వేల మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వచ్చే రోజుల్లో మరిన్ని శిక్షణ తరగతులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని న్యాయమూర్తి సూచించారు.

న్యూ పెన్షన్ స్కీంతో రైల్వే కార్మికులకు నష్టం



నిరసన తెలుపుతున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త పింఛన్ పథకం(న్యూ పెన్షన్ స్కీం)ను రద్దు చేయాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్, ఇంజినీరింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం హంప్ యార్డ్ వద్ద గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ బి.దామోదరరావు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కొత్తగా విధుల్లో చేరిన వారంతా ఈ పథకం కిందకు వస్తారని, దీనిని వ్యతిరేకించేందుకు రూపొందించిన కార్యక్రమాల్లో రైల్వే కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నూతన డివిజనల్ కో ఆర్డినేటర్ పి.వి.జె.రాజు మాట్లాడుతూ మొదటి నుంచి ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా శ్రామిక్ యూనియన్ పోరాడుతోందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21న రైల్వే స్టేషన్ నుంచి డీఆర్‌ఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పి.వి.జె.రాజును కేంద్ర కార్యవర్గ సభ్యులు, బ్రాంచి సెక్రటరీ బి.సోమేశ్వరరావు పరిచయం చేసి, ఇంజనీరింగ్ బ్రాంచ్ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ సూర్యప్రకాష్, ఇతర సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం అవసరం



ఎన్‌వీపీ న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

విశాఖ లీగల్: న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టులో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.

పబ్లిక్ డిమాండ్

తాగునీరు వృథా



పౌర గ్రంథాలయం వద్ద పైపు లీకై వృథాగా పోతున్న తాగునీరు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద తాగునీటి కుళాయి నుంచి నీరు వృథాగా పోతోంది. పైప్‌నకు ట్యాప్ లేకపోవడంతో నీరు ఫౌంటైన్‌లా ఎగసి పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలి.

– కె. శ్రీనివాస్, శ్రీనగర్

ఆధునికీకరించిన సమావేశ మందిరం ప్రారంభం

ఏయూక్యాంపస్: విద్యార్థులు కష్టపడే తత్వాన్ని ఇష్టపడాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో వర్సిటీ పూర్వ విద్యార్థి, అమెరికాలో ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న దేవ పురాణం తన సొంత నిధులతో ఆధునీకరించి అందించిన సమావేశ మందిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నిజమైన హీరోలు, స్ఫూర్తి ప్రదాతలుగా తల్లిదండ్రులు నిలుస్తారన్నారు. సమావేశ మందిరం శిలాఫలకాన్ని విద్యార్థులతో, సమావేశ మందిరాన్ని దేవపురాణం, ఆచార్య శ్యామలతో ఆవిష్కరింపచేశారు.

అరకొరగా ఆకుకూరల విక్రయాలు



వినియోగదారుల కోసం ఎదురుచూస్తున్న ఆకుకూరల రైతులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో ఆకుకూరలు కొనే వారు లేక రైతులు నిరాసకు గురయ్యారు. తీసుకొచ్చిన ఆకుకూరలు అమ్ముడవకపోవడంతో వచ్చి రాని డబ్బులతో కష్టతరంగా మారిందని వాపోతున్నారు. చింతల అగ్రహారం గ్రామం నుంచి రైతులు కొత్తిమీర, పుదినా, తోటకూర, మెంతు కూర, గోంగూర వంటి ఆకుకూరలు రైతుబజార్‌కు తీసుకొస్తుంటారు. శనివారం బజార్‌కు అంతంత మాత్రంగానే వినియోగదారులు రావడంతో సరకు విక్రయాలు జరగలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. తెచ్చిన ఆకుకూరలను పారవేసి నిరాసగా వెనుదిరిగారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com